

# టైటానిక్

## సురేష్

చిక్కబడిన చీకటిలాంటి నిశ్శబ్దం. గోడపక్కన ఎండిపోయిన నాలుగైదు అరటి తొక్కలు. మూలగా చెత్తకుప్పలోంచి బయలుదేరిన చీమలబారు వంటింటి గుమ్మం మీదెక్కి, మలుపు తిరిగి, ఓ మూలగా సింకు కింది కన్నంలోకి మాయమవుతోంది (ఆ కన్నంలో నీళ్లెండిపోయి నాలుగురోజులు దాటింది).

పైన సింకులో సగం కుళ్లిన వంటపాత్రలూ, పొడి అంటుకుపోయిన టీగిన్నె, పక్కన అరుగు మీద ఈగలు ముసురుతున్న పంచదార తునకలు. అరుగుమీది గ్యాస్‌స్టవ్వు నుంచి కారి నేలమీద చారికలు కట్టిన ఎండిన టీ ఆనవాళ్లు. పక్కన పల్లీ తొక్కలూ, దుమ్మూ. ఆ దుమ్ము తివాచీ వంటగది అంతటా వ్యాపించి, ఆ గదిగుమ్మం దాటి, నడిమి గది సోఫా కిందుగా ముందు గదిలో చెప్పులస్టాండు దాకా పరుచుకొని ఉంది. స్టాండు పక్కనే గ్రిల్‌లోంచి లోపలికి జారి గత వారంరోజులుగా పోగుపడిన ఇంకా తెరువని దినపత్రికలు.

నడిమిగదిలో సోఫా మీద ఓ కాలుజారేసి నేల మీద వెల్లకిలా పరుండి ఉన్న అతను.

బయట ఎక్కడో ఆటో స్టార్ట్ అయిన చప్పుడు. కింద కాంపౌండ్‌లో కూరలమ్మి కేక. ఎవరిదో నవ్వు. ఏదీ గమనించని- నిద్రో మెలకువో కాని స్థితి. అతనా అస్తవ్యస్తమైన భంగిమలో పరుండి పదిహేడుగంటలు దాటుతోంది- బయట ఎవరో తలుపు తట్టిన సమయానికి.

*

ఉదయం పదింటికే ఎండ చితచితలాడుతోంది. కొత్తగూడెంపైన ఆకాశం మెగ్నీషియం తీగలాగా మండుతోంది. కళ్లు మిరుమిట్లు గొలిపే గ్లేరింగ్. నిప్పుల కుంపటిలాంటి సన్నటి సెగ. పట్టుకున్న ప్రతి వస్తువూ చురచుర కాలుతోంది.

“మీరు మనుషులు కాదు స్వామీ,” అన్నాడు ప్రసన్న - డ్రైవర్ పక్క సీట్లోంచి వెనక్కు తిరిగి. అతడు తల మీదుగా జేబురుమాలు కట్టుకొనే ప్రయత్నంలో సతమతమవుతున్నాడు.

“పశువులమంటావా?” అన్నాడు శ్రీహరి చిరాకుగా, తన నెత్తి మీంచి జేబురుమాలు లాగేసి. అతడికివతలగా కూర్చొని ఎటో చూస్తున్న రాజారావు, అవతలగా రత్నకిషోర్, స్వరూప్.

“ఈ టయంలో ఇలాంటి జీపులో బయల్దేరామంటే అలా అనుకోవటంలో ఏ మాత్రమూ తప్పులేదు. కాన్నా ఉద్దేశ్యం మాత్రం మీరు మగాత్ములని,” అన్నాడు ప్రసన్న.

ఆ సమయంలో బయట కనుచూపు మేరలో పిట్ట వాలటానికి చెట్టు కూడా లేదు. అక్కడక్కడా ఎండిపోయిన పొదలు. అవి అవతలగా థర్మల్ పవర్‌స్టేషన్ గాల్లోకి వదలుతున్న బూడిదలో మునిగి తలలు వేలాడేసి కూచొని ఉన్నాయి. అంతటా గడ్డకట్టినట్టున్న వికారమైన నిశ్శబ్దం. జీపు గతుకుల్లోకి ఎగిరి పడినపుడల్లా రోడ్డు మీద తివాచీలా పరుచుకొని ఉన్న బూడిద, మేఘంలా కమ్ముకుంటోంది. జీపు దాటిన వెంటనే మళ్లీ యథావిధిగా సర్దుకుంటోంది.

ఇంతలోనే కొత్తగూడెం పాలొంచ మధ్యగా ఎడమవైపు రోడ్డు మీదకు మళ్లింది జీపు. ఆ మలుపు దగ్గర రోడ్డుకి అడ్డంగా విస్తరించుకొని ఒక బోర్డు వుంది.

దాని మీద తుప్పుపట్టిన 'ఆంధ్రా స్టీల్స్' అక్షరాలను ఎవరూ గమనించినట్టు లేదు (అక్కడి నుంచే ఆ ఫ్యాక్టరీ ఆవరణ మొదలువుతుంది).

"అబ్బ! ఈ రోడ్డు మీద మనుషులు తిరిగి ఎన్నాళ్ల యిందో సార్," అన్నాడు జీపు డ్రైవరు- గతుకులు పడి ఉన్న రోడ్డు మీదకు దృష్టి మళ్లించి.

"ఎన్నాళ్లు కాదు ఎన్నేళ్లని అడుగు. ఏం సార్," అన్నాడు శ్రీహరి రాజారావును మోచేత్తో తట్టి. అతను ఏదో అనబోయి- దూరంగా గుట్టల వెనగ్గా కనపడు తున్న ఆంధ్రా స్టీల్స్ కట్టడాల్ని మెడ రిక్కించి చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

డెజావు.

ఈ దారి, ఈ బూడిద, ఈ వేసవి... అంతా ముందే అనుభవించేసినట్టు లోపల ఏదో చుట్టలు చుట్టుకున్న పాములా కదలాడుతోంది. ఈ దిక్కుమాలిన ప్రయాణం తనీ జన్మలోనే చేయాల్సి వస్తుందని అతను కలలో కూడా అనుకొన్నట్టు లేదు.

"అప్పటికే మనిషి మొత్తం షేకయిపోయినట్టు అగుపిచ్చాడు," అన్నాడు శ్రీహరి బోసుతో- తర్వాత ఒకసారి. ఆరోజు వాళ్లిద్దరూ మాదాపూర్ దగ్గర ఆటో పట్టుకొని హబ్సిగూడా వైపు వస్తున్నారు.

"ఎందుకని అంతలా?" అడిగాడు బోసు.

శ్రీహరి కాసేపు మాట్లాడలేదు. తర్వాత అన్నాడు.

"చివరికెలాగో నోరువిప్పి అన్నాడు."

"ఏమనీ?"

"నాలుగేళ్లు. అప్పుడే నాలుగేళ్లు... ఇది మూత బడి," గొణుక్కున్నట్టు అన్నాడు రాజారావు. మళ్లీ తనే అడిగాడు.

"ఏం శ్రీహరీ! నీకూ తెల్సుగా నువ్వూ ఉన్నట్టు న్నావు చివర్లో?"

"లేద్సార్. నైన్టీటూ డిసెంబర్‌లో అనుకుంటా... నేను బయటపడ్డా లక్కీగా. మీరు మాత్రం చివరిదాకా ఉన్నట్టున్నారు."

చివరిదాకా... పరధ్యానంగా తలూపాడు రాజా రావు.

ఇంతలోనే డ్రైవరు జీపును ఎడమవైపుకి సర్రున కోసి మరొక వందగజాలు పోనిచ్చి అక్కడి గేటు ముందు సడన్‌బ్రేకు కొట్టాడు.

అప్పటికే ఆ గేటుకివతలగా అరవైమంది దాకా జమయ్యి ఉన్నారు- ఇంజనీర్లూ, సూపర్‌వైజర్లూ. అవ తలగా రెండు జీపులూ, మూడు అంబాసిడార్ కార్లూ. ఇంకా అవతల పది పదిహేనుమంది వర్కర్లు టేపులూ, వేష్టుకాటనూ, పెయింటు బ్రష్షులూ పట్టుకొని ఇటే చూస్తున్నారు.

ఆ గుంపులోంచి విద్యాసాగర్ ఎండకు వాలుగా చెయ్యడ్డం పెట్టుకొని జీపు దగ్గరకు వచ్చాడు.

"ఏందయ్యోవ్! అర్చుకు తీర్చుకు వొచ్చారు. మేమిక్కడ దిగడి గంటయ్యింది. వాడేమో పర్మిషన్ లెటర్ లేందే గేటు కూడా తియ్యనంటున్నాడు," అన్నాడు గొంతు పెంచి.

జీపుకు అటువైపు దిగిన శ్రీహరి తపీమని ఏదో అనబోయి- ఎందుకీ ఎలక్ట్రికల్ వాళ్లతో లేనిపోని తంటా అనుకొని- గేటు మీద ఆర్చిలాగా రెండు చివర్లనూ కలుపుతున్న బోర్డును చూస్తున్నాడు. దానిమీద పొరలు పొరలుగా పెయింట్ ఊడుతున్నది. లీలామాత్రంగా అక్షరాలు మాత్రం కనిపిస్తున్నాయి.

'ఆంధ్రా స్టీల్స్ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థ)'

"అవునిదే ఆంధ్రాస్టీల్స్," అన్నాడు అక్కడ నిలబడి ఉన్న సెక్యూరిటీ గార్డు- సరిగ్గా అయిదేళ్ల క్రితం అదే గేటు ముందు నిలబడి ఉన్న శ్రీహరిని అనుమా నంగా చూసి. అప్పటికి శ్రీహరి నూనూగు మీసాల యవ్వనంలో ఉన్నాడు. నలిగిన బట్టలూ, పెచ్చు లూడిన సూట్‌కేసూ, పీల ఆకారం. అతను లోహ శాస్త్రంలో పట్టా పుచ్చుకొన్న క్వాలిఫైడ్ ఇంజనీరంటే గమ్మున నమ్మటం ఎవరికైనా కష్టమే.

ఆ గార్డు కొరచూపులకి తడబడిన శ్రీహరి పై జేబులోంచి ఓ కాగితం లాగి హడావిడిగా అతని కిచ్చాడు. దాన్ని పైనుంచి కిందకి శల్య పరీక్ష చేసి గేటు కానుకొని కుడిపక్కగా ఉన్న సెక్యూరిటీ ఆఫీసులోకి పోయి, "సార్ కొత్త ఇంజనీర్ ట్రైనీ," అన్నాడతను.

కాసేపటికి శ్రీహరికి లోపలికి వెళ్లటానికి అను మతి లభించింది.

గొలుసు ఊడదీసి గేటు తీశాడు గార్డు.

చెప్పరాని ఉద్విగ్నత.

జీవితంలో మొదటిసారిగా ఇంకా క్యాంపస్ జీవితం, హాస్టల్ గదీ, కాలేజీ నేస్తాల జ్ఞాపకాలు వొదలని లేత యవ్వనం చెంపల మీద జీరాడుతుండగా- ఇరవ య్యేళ్ల వయసులోనే - అతనా గేటుదాటి ఆంధ్రా స్టీల్స్ ఆవరణలోకి అడుగుపెట్టాడు- బాధ్యత కలిగిన ఇంజ నీర్‌గా.

లోలోపల ఒక రాగం.... అతని వెన్ను జలదరిం చింది.

'జిస్ దేశ్‌కీ ధర్‌తీ.... సోనా ఉగ్‌లే ఉగ్‌లే హీరే మోతీ...'

జలజల పారే నీళ్లూ... బంగారు పంటలూ... భారీ డ్యాములూ... పరిశ్రమలూ... రైతులూ... కార్మికులూ... ఆనందం వెల్లివిరిసే మొహాలూ.... విజన్ 1947.

అదొక బంగారు స్వప్నం.

'వీడొక వెర్రినాయాలు,' అన్నారు ఆడిటోరియంలో అతని క్లాస్‌మేట్లు- కన్నార్పకుండా మనోజ్ కుమార్‌ని చూస్తున్న శ్రీహరిని- వాళ్లు సెకండియర్‌లో ఉన్నప్పుడు (ఆరోజు ఆడిటోరియం అంతా పిల్లికూతలతో, టార్జాన్ అరుపులతో హోరెత్తిపోతోంది. ఫిల్మ్ కమిటీలో ఉన్న స్టూడెంటు నాయకులు అవమానంతో కుంగిపోతూ ఉన్నారు - ఆ సినిమా పొరపాటున తెచ్చినందుకు).

వాళ్లందరూ ఫైనల్ ఇయర్‌లో కొచ్చాక- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సమయంలో- మై డ్రీం కంపెనీ ఆప్షన్ కింద లాయిడ్స్, ఎస్సార్, టిస్కో కంపెనీల్ని ఎన్నుకోగా శ్రీహరి ఒక్కడూ ఆంధ్రా స్టీల్స్ అని రాసేశాడు.

''అయితే ఇదేనన్న మాట అప్పటి నీ డ్రీం కంపెనీ,'' అన్నాడు వెనగ్గా జీపులోంచి దిగిన ప్రసన్న- గేటులోంచి లోపల కనబడుతున్న రేకులూడిన సెక్యూరిటీ ఆఫీసునూ, సగం కాలిన స్కూటర్ స్టాండునూ, గోతులు పడిన ఆవరణనూ చూస్తూ.

శ్రీహరి మాట్లాడలేదు.

''సారీ సార్ జీపు అరేంజయ్యేసరికి లేటయ్యింది,'' రాజారావు విద్యాసాగర్‌కి క్షమాపణ చెప్తూ హడావిడిగా నడిచి గేటు దగ్గర ఉన్న సెక్యూరిటీ ఆఫీసరుకి ఓ లెటర్ అందించాడు.

మరి కాస్సేపటికి గేటుకి వేలాడే పెద్ద తాళం తెరిచి, భారీ గొలుసును ఊడదీశారు. గేటు కిరకిర లాడుతూ తెరుచుకుంది.

అందాకా బయట ఎండకు మాడుతున్న ఇంజనీర్లూ, వర్కర్లూ కోలాహలంగా మాట్లాడుతూ లోపలికి నడిచారు.

గేటు నుంచి లోపల మెయిన్ బిల్డింగ్‌కి దాదాపు రెండు ఫర్లాంగుల దూరం ఉన్నట్టుంది. అందాకా పరుచుకొని ఉన్న సన్నటి తార్రోడ్డు గతుకులు పడి, నెర్రెలు కొట్టి ఉంది. నెర్రెల్లోంచి ఇంతెత్తున లేచిన రెల్లు పొదలూ, గడ్డి దుబ్బులూ.

''గమ్మత్తుగా లేదూ? రోడ్డు మధ్యలో చెట్లు,'' అన్నాడు రత్నకిషోర్ ప్రసన్నతో.

''అబ్బాయిలూ! జాగ్రత్త. కొండ చిలువలుంటాయి. నిజంగా,'' సివిల్ కృష్ణ నవ్వు.

రాజారావు తలొంచుకొని నడుస్తున్నాడు. ఒకప్పుడీ రోడ్డు మీద రోజుకి కొన్ని వందల లారీలు లోడు వేసుకొని పరిగెత్తేవి. వేలమంది జనం నడిచిపోయే వాళ్లు.

మరికొద్ది నిముషాల్లో వాళ్లు ఓ భారీ షెడ్డు ముందుకొచ్చారు.

అది నాలుగైదు తాటిచెట్ల ఎత్తున మొత్తం గాల్వనైజ్డ్ ఇనుపరేకులతో కప్పబడి ఉంది. ముందు వైపున లారీలు కూడా వెళ్లటానికి వీలుగా ఒంటి నిట్టాడి ఎత్తున ఒక ద్వారం ఉంది. ఎండలో రావటంవల్ల వాళ్లకి షెడ్డు లోపల చిమ్మచీకటి అలుముకొన్నట్టు కనిపిస్తోంది.

రాజారావు కళ్లు ఆ చీకటిలో చిక్కుబడి వున్నాయి.

''అబ్బాయిలూ ఇక్కడ్నుంచి మనం నాలుగైదు టీములుగా విడిపోదాం. స్విచ్‌గేర్ రూంకీ, కంట్రోల్ రూంకీ మావాళ్లు పోతారు. మిగిలిన వాటిల్లో మినిమం ఒక ప్రొడక్షను ఇంజనీరూ, ఒక ఎలక్ట్రికల్ ఇంజనీరూ, ఇంకా ఇద్దరు హెల్పర్‌లూ ఉండాలి. ఏం రాజారావ్? ఇవ్వాళ సాయంత్రం దాకానే మనకి టైముంది. ఈలోగా మొత్తం సర్వే అయిపోవాలి. ఏమంటావ్?'' అన్నాడు విద్యాసాగర్.

రాజారావు తలూపాడు.

అలా ఆరు టీములు ఏర్పడ్డాయి. విద్యాసాగర్ ప్లాన్ ప్రకారం వాళ్లు తలా ఒక దిక్కు కదిలారు. చివరి టీములో విద్యాసాగర్, రాజారావు, శ్రీహరి, ప్రసన్న, రత్నకిషోర్.

''సత్తెన్నారాయణా! నువ్వు జలీల్‌నీ, ఇంకిద్దర్నీ తీసుకొని మా వెంటరా. ఎత్తులు ఎక్కాల్సి వుంటది. వాడైతే కోతిలాగా ఎగబాకుతాడుగా,'' విద్యాసాగర్ అక్కడే నిలబడి ఉన్న ఓ కాంట్రాక్టర్‌ని పిలిచి చెప్పాడు.

''అలాగే సార్,'' అన్నాడు సత్యన్నారాయణ.

''సార్! ఇప్పుడే వస్తా. మీరు పదండి,'' శ్రీహరి స్వరూప్‌ని పిలుస్తూ ఇంకోవైపు కదిలాడు.

ముందుగా రాజారావు ఆ షెడ్డులోకి అడుగు పెట్టాడు.

సన్నటి చీకటి. కొంచెంసేపటికి కళ్లు అలవాటు పడ్డాక ఒక్కొక్కటీ కనిపించాయి- రంగస్థలం మీద తెర లేచినట్టు.

ఎదురుగా షెడ్డుకి ఆ చివరిదాకా విస్తరించి ఉంది గాంట్రీ బే. బే నిండా గోతులు పడి ఉన్నాయి- పైన రేకులు ఊడిన చోట్ల నుండి వర్షాకాలం కారే నీళ్లవల్ల. షెడ్డు కటూ ఇటూ సపోర్టుగా భారీ కాలమ్స్. వాటి మీద పొడుగాటి రెయిల్స్. రెయిల్స్‌కా చివర ఎన్నో ఏళ్లుగా విశ్వసనీయంగా నిలబడి ఉన్న ఈ.ఓ.టీ క్రేన్. దానికింకా పైన రేకులకి సపోర్టుగా అల్లిబిల్లిగా అల్లుకొని ఉన్న పైపులూ, ఏంగిల్సూ. వాటి జాయింట్లలో పావురాలు గూళ్లు కట్టాయి. కొన్ని ఏళ్ల తర్వాత ఆ షెడ్డులో మళ్లీ వినిపించిన మనిషి తాలూకూ అలికిడికి అవి ఆశ్చర్యపోయినట్టు కిందకి చూశాయి.

వెనుక ద్వారంలోంచి పడుతున్న ఎండ వెలుగులో, ఆ విశాలమైన షెడ్డుకి ఒక చివరగా నిలబడి వున్న రాజారావు- రోమ్ నగరంలోకి ప్రవేశించిన గ్రీకు యోధుడంత చిన్నగా ఉన్నాడు...

కదలలేనట్టు.

అతని చూపులు గాంట్రీ బే మధ్యన నిలువెత్తుగా నిలబడి ఉన్న ఫర్నేస్ మీద నిలిచి ఉన్నాయి. తొమ్మిది మీటర్ల ఎత్తూ, ఆరు మీటర్ల వ్యాసం ఉన్న దాని జైగాంటిక్ నడుము మీది మెటాలిక్ అక్షరాలు ఇంకా చెక్కు చెదరనట్టు ఈ చివరిదాకా కనిపిస్తున్నాయి.

'కంకాస్ట్ మెషీన్.'

దాని నడుము మీద వడ్డాణంలా గుండ్రటి ప్లాట్‌ఫాం. దానిమీద నుంచి నేలకు జారి ఉన్న ఇనుపనిచ్చెన. ముదురు జేగురు రంగులోకి మారుతున్న ఫర్నేస్ బాడి అక్కడక్కడా కన్నాలు పడి జల్లెడలా తయారయి వుంది. చర్మంలోంచి బొమికలు పొడుచుకొచ్చినట్టు ఆ కన్నాల్లోంచి మోర్టారూ, ఫైర్‌బ్రిక్సూ వికృతంగా బయటకు వెళ్లాడుతున్నాయి. ఫర్నేస్‌కి ఆ పక్కన రా మెటీరియల్‌ను ఫీడ్ చేసే ఏటవాలు కన్వేయర్. ఇప్పుడు దాని బెల్టు నడుము విరిగిన కొండచిలువలా నేలమీదకు జీరాడుతోంది.

షెడ్డు అంతటా గడ్డిగాదంతో, పావురాల రెట్టలతో ఒకలాంటి మాగువాసన. పావురాలు రివ్వున ఎగిరినప్పుడు తప్ప అంతటా గాఢమైన నిశ్శబ్దం.

అది కాదు రాజారావు చూస్తున్నది.

ఫర్నేస్ ప్లాట్‌ఫాం మీద నిలబడి ఉన్న నాగభూషణం, అతని ముఠా.

వాళ్లు ఫర్నేస్ మూతి మీద బిరడాలా బిగుసుకుపోయి ఉన్న ఫైర్‌క్లేను పొడవాటి ఇనుపరాడ్డుతో లయబద్ధంగా మోదుతున్నారు- ఏడెనిమిదిమందీ- ఒకరి శరీరం ఒకరికి అనుసంధానించినట్టు- ఒకేలా - దెబ్బ మీద దెబ్బ.

అరె పిల్లా చూడు హైస్సా
అరె పిల్లా నవ్వూ హైస్సా
మొగలి పువ్వూ హైస్సా
పిల్లా ........... హైస్సా
నిమ్మ పళ్లూ హైస్సా
............................
............................

పచ్చి బూతుపాట. ("ఎండీ గాదు, వాడి ముత్తాత మొగుడొచ్చినా ఈ పాట మాత్రం ఆగదు సారూ! పాట గానీ ఆగిందా. ఇక జూస్కోండి. మీ ఇంజనీర్లొచ్చి మెటలు తీయాల్సిందే," అనేవాడు నాగభూషణం - రాజారావుతో పరాచికాలాడేప్పుడు).

ఫర్నేస్ మూతిలోంచి ముదురు ఎరుపురంగు లోహద్రావకం భగ్గున మండుతూ... మిరుమిట్లు గొల్పుతూ... బయటకు దూకింది. కింద ఉన్న పెద్దపెద్ద తొట్లలో అది పడేప్పుడు కాకరపువ్వొత్తులు పేలినట్టు చిటపటమని ఎగురుతోంది. ("అబ్బాయ్! అది గినా ఒక్క బొట్టు మీద పడిందా. సేఫ్టీషూసూ, గీఫ్టీ షూసూ జాంతానై. షూ పై నుంచి కిందకు బొక్కడి పోవాల్సిందే. మధ్యలో నీ అరికాలు..."). ఆ మండే లోహపు ఎర్రని వెలుగు షెడ్డులో ఉన్న ప్రతి లోహపు వస్తువు మీదా ప్రతిఫలించింది. చెమట ధారల్లో స్నానం చేస్తున్న నాగభూషణం మనుషులు ఆ వెలుగులో చిత్రంగా మెరుస్తున్నారు. వాళ్ల తలల మీద హెల్మెట్లూ, కారు నలుపు కళ్లద్దాలూ, సేఫ్టీషూసూ.

హఠాత్తుగా వాళ్లు ఫర్నేసు నుంచి లేస్తున్న పొగ మేఘంలో అదృశ్యమయ్యారు. ఆ బూడిద మేఘం మెల్లగా పైకి లేచి షెడ్డు మొత్తం అలుముకుంది. షెడ్డు మొత్తం ఇంజనీర్ల హడావిడితో, సూపర్‌వైజర్ల అరుపులతో, వర్కర్ల పరుగులతో హోరెత్తిపోతోంది. పైనెక్కడో కేబిన్‌లో కూచున్న ఈ.ఓ.టీ క్రేన్ ఆపరేటర్ సత్యన్నారాయణ పెద్దగా వదరుతున్నాడు. అతనికి ఊపిరాడుతున్నట్టు లేదు.

వెనుక నుంచి దగ్గాడు సత్యన్నారాయణ.

"ఇక మొదలెట్టండి. సత్తెన్నారాయణా! మీవాళ్లకు చెప్పు," విద్యాసాగర్ ఆదేశించాడు.

"దీని డ్రాయింగులుంటే బాగుండు," రత్నకిషోర్ అన్నాడు ఫర్నేస్ వైపు చూస్తూ.

''ఎందుకు సార్! దీని కొలతలన్నీ రాజారావు గారికి నోటిలెక్కలే,'' అన్నాడు సత్యన్నారాయణ.

''ఓ! అప్పుడు నువ్వూ ఇక్కడే తగులడ్డావు కదూ,'' విద్యాసాగర్ అన్నాడు ఒకలాంటి నిరసనతో.

''అవున్సార్. ఈనె క్రేన్ ఆపరేటర్ అప్పట్ల,'' అందించాడు జలీల్.

''ఆహా! ఆ సోకు కూడా అయిందీ?''

''ఆయనకేమి సార్. పెద్ద కాంట్రాక్టరయ్యిండు. ఇందట్ల పంజేసిన వందలమంది మాత్రం.... అయిన గిదుండాలె సార్ దునియల,'' నుదుటిమీద గీత గీసి చూపించాడు జలీల్.

నిజానికి జలీల్ చెప్పినంత సులభంగా జరగ లేదు సత్యన్నారాయణ ప్రయాణం. ఇక్కడ పొగలో, బూడిదలో మునిగితేలిన పదేళ్లూ తన భవిష్యత్తు గురించీ, నిలవబెట్టటం గురించీ అతనంత పట్టించు కుంది లేదు. తనూ, తన క్రేనూ ఎల్లకాలం ఉండిపోతా యన్న భరోసా ఉండేది. కానీ చూస్తుండగానే ఆ క్రేను ఆగిపోయింది. బతుకు కాలనీలోంచి బజార్న పడింది. ఒకటి రెండేళ్లు ఫాక్టరీ మళ్లీ తెరుస్తారన్న ఆశతో యూని యన్‌ల చుట్టూ తిరగటం, అర్థాకలితో వెళ్లమార్చటం చేశాడు. తర్వాత పాలొంచ థర్మల్ పవర్‌స్టేషన్‌లో పంజేసే స్వకులస్థుడైన ఒక కాంట్రాక్టరు జాలిపడి రమ్మ నడంతో అక్కడ కొంతకాలం మొబైల్ క్రేను ఆపరే టరుగా చేరి, అక్కడే చిన్నచిన్న పనులు సబ్ కాంట్రాక్టుకి తీసుకొని ఇప్పుడు ముప్ఫై మంది వర్కర్లను మెయిం టెయిను చేస్తున్నాడు.

''నిజం సారూ! తలరాత. లేదంటే నేనీడి కింద కూలిపనులు చేసుడేంది?'' మళ్లీ అన్నాడు జలీల్. జలీలు కూడా అప్పట్లో క్రేన్ ఆపరేటరే. వేర్వేరు షిఫ్టులు ఇద్దరివీ.

''ఒరే మూసుకుంటావా? మళ్లీ సుంతీ చేయిం చేదా?'' బూతులు తిట్టాడు సత్యన్నారాయణ.

''అందరూ కల్సి దీని కొంప ముంచారు కదరా! ఇప్పుడు సమ్మగా ఉందా?'' ఛీత్కరించాడు విద్యా సాగర్.

జలీల్ గొణుక్కుంటూ అవతలికి పొయ్యి ఫర్నేస్ కొలతలు తీసుకోవటం మొదలెట్టాడు. యాంత్రికంగా అతని వెనుకే కదిలారు మిగిలిన వర్కర్లు.

రాజారావు గొంతు విప్పి అన్నాడు.

''జలీల్! దీని సంగతి నాకొదిలి మీరు మిగతా పన్లు చూడండి.''

అతను ఓ తెల్లకాగితం మీద ఏవో లెక్కలు వెయ్యటం మొదలెట్టాడు- ఓ స్తంభానికి ఆనుకొని, ఫర్నేస్ క్రాస్ సెక్షను గీస్తుంటే వేళ్లు వణుకుతున్నాయి.

అప్పుడే బయటనుంచి వచ్చిన శ్రీహరి, ''మైగాడ్ కంకాస్ట్ మెషీన్,'' అన్నాడు- తన కళ్లని తనే నమ్మలే నంత విభ్రాంతిగా.

ఆటోలో బోసుతో మాట్లాడినప్పుడు కూడా అతని గొంతులో అదే ధ్వనించింది.

''జస్ట్ ఊహించుకో బోసూ! కొన్ని వందలమంది ఉద్యోగులూ, కార్మికులూ, పరిగెత్తే లారీలూ.... చేతి నిండా పనితో పాలొంచ నిండా చిన్నచిన్న వర్క్‌షాపులూ, ఫౌండ్రీలూ, వాళ్ల కుటుంబాలలో వేలకొద్దీ జనాలూ.... అన్నీ ఎవడో మాంత్రికుడు చెయ్యి ఊపినట్టు మాయమై పోయాయి. హిరోషిమా నగరాన్ని మనం ఎప్పుడూ చూడ లేదుగానీ ఆరోజు అక్కడ...''

అతని మాటల సాయంతో ఆ విధ్వంస దృశ్యాన్ని కళ్లముందు నిర్మించుకొంటున్నాడు బోసు. మూడేళ్ల తర్వాత కూడా శ్రీహరికి అక్కడ ఆరోజు జరిగిన ప్రతి విషయమూ గుర్తుండటమే ఆశ్చర్యం. అదే అన్నాడు బోసు.

''దాందేముంది. ఆరోజేకాదు. అంతకు అయిదేళ్ల ముందు నేనా షెడ్డులో మొదటిసారి అడుగు పెట్టి నప్పుడు.... అక్కడ ఎవరెక్కడ నుంచొని ఉన్నారో కూడా చెప్పగలను.''

శ్రీహరి మాటల్లో అతిశయోక్తి లేదు.

ఆరోజు సెక్యూరిటీ ఆఫీసులోనే తన పెచ్చు లూడిన సూట్‌కేసుని వదిలి అతను ఆ షెడ్డులో అడుగు పెట్టేసరికి ఈ.ఓ.టీ. క్రేను కిరకిరలాడుతూ అతని నెత్తి మీదుగా వస్తోంది. కొంచెం ఉంటే దాని భారీ ఇనుప కొక్కెం తగిలేసును.

పై నుంచి సత్యన్నారాయణ పెద్దగా వొదరు తున్నాడు.

ఎవరో కార్మికుడు అతన్ని మెరుపులా పక్కకి లాగే శాడు (ఆ తర్వాత అతని పేరు 'సనా' అని తెల్సింది).

''కొత్తగా జేరావా?'' అదోలా అడిగాడతను.

''ఇవ్వాళే.'' తేరుకోవటానికి టయిం పట్టింది.

''జేగర్త.'' కదిలాడు.

''ఒక్క నిముషం.'' శ్రీహరి ఖంగారుగా అడిగాడు. ''బుచ్చిరెడ్డిగారనీ- సీనియర్ జనరల్ మానేజర్ ఎక్క డుంటారు?''

తను రిపోర్టు చేయాల్సిందతనికే.

''వాడే ఆ పిచ్చి లం... కొడుకు,'' అన్నాడు సనా-పదడుగులవతల నిలబడి ఎవరి మీదో అరుస్తున్న పిప్పిళ్లబస్తా లాంటి మనిషిని చూపిస్తూ.

బుచ్చిరెడ్డి అటు తిరిగి అక్కడ గుంపుగా నిలబడి ఉన్న కార్మికుల మీద అరుస్తున్నాడు. వెనగ్గా నిలబడిన వాళ్లు పరిహాసంగా తమలో తాము మాట్లాడుకొంటున్నారు.

''మట్టి కొట్టుకుపోతార్రా నీయమ్మ,'' అంటున్నాడతను.

''ఇప్పుడు మాత్రం మాకేమి మిగిలిందని. అంతా మీరే... తిన్నాక,'' అన్నాడో కార్మికుడు అంతే స్థాయిలో. ఎవరో సూపర్‌వైజర్ సర్ది చెప్పలేక సతమతమవుతున్నాడు.

శ్రీహరికి ఆ షాక్ నుంచి తేరుకోవటానికి ఆరేడు నెలలు పట్టింది. అందాకా అతనికి ఇండస్ట్రీ అంటే ఏవో ఊహలుండేవి. పరస్పర గౌరవాలూ, ఆప్యాయతలూ, ఉమ్మడి లక్ష్యాలూ వగైరా...

కాసేపటికి ఆ అరుపులు ముగించి ఇటు తిరిగిన బుచ్చిరెడ్డిని బిక్కుబిక్కుమంటూ సమీపించి తన జాయినింగ్ రిపోర్టు ఇవ్వబోయాడు శ్రీహరి.

ధుమధుమలాడుతూ ఇంతెత్తున లేచాడు బుచ్చిరెడ్డి.

''ఇక్కడా... ఇక్కడా రిపోర్టు చేసేది. ఆఫీసుకి తగలడు... మానర్‌లెస్...'' ఎటో వెళ్లిపోయాడు అరుస్తూ.

శ్రీహరి బిక్కచచ్చిపోయాడు. అవతలగా నుంచొని ఇటే చూస్తున్న కార్మికులు. కొందరు జాలిగా. ఈ నేల ఇప్పుడే చీలి తనందులో దూకేస్తే... అలా అతనెంతసేపున్నాడో గానీ... అప్పుడే ప్రొడక్షన్ ఆఫీసు నుంచి చంకలో రెండు డ్రాయింగులు పెట్టుకొని మెట్లు దిగి వచ్చిన రాజారావు అక్కడి వాళ్లనేదో అడిగి శ్రీహరి దగ్గరకి నడిచాడు.

''సారీ. సారీ గురూ. ఇక్కడి పరిస్థితేమీ బాగోలేదు. ఇప్పుడెందుకు జేరినట్టూ?'' అన్నాడు. అతని స్నేహపూర్వకమైన నవ్వు. మొహంలో ప్రసన్నత.

''మనిషిలో ఏదో ఉంది. లేదంటే ఫాక్టరీ మొత్తం మీద అతనొక్కడి మాటే ఎందుకు వింటారు కార్మికులు. మిగతావాళ్లకి వాళ్లతో పని చేయించాలంటే గుడ్లు వెళ్లుకొచ్చేవి. ఓరి నాయనోయ్... నీకు తెలీదు. ఒక్కోడూ ఒక్కోరకం...'' అన్నాడు శ్రీహరి బోసుతో.

''ఏమి అంత హడలిపోతున్నావు?'' అడిగాడు బోసు. అతనికి వినోదంగా ఉన్నట్టుంది.

''చెప్పానుగా నువ్వుగానీ చూస్తే...''

అతనికింకా లీలగా గుర్తు.

మొదటిసారి నైట్‌షిఫ్ట్‌లోనే వాళ్లకు దొరికిపోయాడు. ముందొకరిద్దరు వినయంగా అడగటం మొదలేశారు. మెల్లగా చుట్టూ ఒక గుంపు జేరింది. అతని పేరూ, ఊరూ, తల్లిదండ్రుల వివరాలూ, పొలమూ చివరిగా కులమూ అడిగారు. (అప్పటికే అతని మొహం ఎర్రబడిపోయింది). తర్వాత అతని సబ్జెక్టుపై ప్రశ్నలు. టెంపరేచర్లూ, మెల్టింగ్ పాయింటులూ, హార్డ్‌నెస్సూ వగైరా. నాలుగేళ్లకు పైగా మథించిన లోహశాస్త్రం అతన్నాదుకోలేకపోయింది. అతనిచ్చిన ప్రతి జవాబుకి సానుభూతిగా తల అడ్డంగా తిప్పటమూ, అందులో తప్పులు వివరించటమూ. వెనుక నిలబడిన వాళ్లు ''చ్చొ.... చ్చొ'' అంటున్నారు. ఇంకెంతసేపు ఆ రాగింగ్ సాగేదోగానీ ఈలోగా రాజారావు అటుగా వొచ్చి అతన్ని రక్షించాడు. శ్రీహరిని తీసుకొని గాంట్రీబే పక్కకి నడిచాడు.

''శ్రద్ధగా నేర్చుకోవాలి. అన్నీ గమనిస్తుండు. లేదంటే వీళ్లు తాటాకులు కట్టేస్తారు,'' అన్నాడు. (అతనికి వాళ్లమీద చిన్నచూపు లేకపోవటమూ, పైగా అదోలాటి కన్సర్న్ ఉండటమూ గమనించాడు శ్రీహరి).

''అలాగే సార్ కానీ...''

''ఊ! చెప్పు''

''లేద్సార్ నిన్న మీరన్నారు. ఇక్కడ పరిస్థితి బాగోలేదు, ఇప్పుడెందుకు జాయినవటం అని,'' శ్రీహరిలో ఒకలాటి ఆందోళన ధ్వనించింది.

నిజానికి అతనికది కాలేజీలోనే మొదలైంది. తను ఆంధ్రాస్టీల్స్‌ని ఎంచుకున్నందుకు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఇన్‌ఛార్జ్ అదోలా చూసి, ''మే గ్లాడ్ బ్లెస్‌యూ,'' అన్నాడు అపాయింటుమెంట్ లెటర్ అందిస్తూ. 'నిజంగా వీడొక ఎరుపు,' అని మిత్రులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు- చివరిరోజు కాలేజీ గేటు ఎదురుగా చారియట్‌లో మూడో బీరు ముగించాక. (ఆ తెల్లారే అందరూ పెట్టేబేడా సర్దుకొని హాస్టల్ వెకేట్ చేసి తమతమ ఉద్యోగాల్లో చేరటానికి బయలుదేరారు, ఖాజీపేట జంక్షన్‌లో వీడ్కోళ్లు చెప్పుకొని. శ్రీహరి ఒక్కడూ డోర్నకల్ జంక్షన్‌లో దిగి ఈసురోమంటున్న కొత్తగూడెం పాసింజరులోకి మారాడు).

''అదా?'' నిట్టూర్చాడు రాజారావు- అతని ఆందోళనని అర్థం చేసుకొన్నట్టు. అతడు దీర్ఘంగా నిశ్వసిస్తూ

ఓ పక్కకి నడిచి వర్కర్లు డ్రస్సులూ, బూట్లూ, పళ్లాలూ దాచుకొనే జాజి చెక్క పెట్టెల వరుస మీద కూర్చొన్నాడు.

"కూచో చెప్తా. నిజంగానే పరిస్థితి బాగోలేదు," ఎక్కడ మొదలుపెట్టాలా అన్నట్టు సాలోచనగా వంగి తన కాళ్లకున్న బూట్లు ఊడదీసి దులుపుతున్నాడు. వాటిలోంచి గుప్పెడు శ్లాగ్ రాళ్లు రాలిపడ్డాయి. అతడి కాలి చిటికెన వేళ్ల పక్కగా చింతగింజంత లావున నల్లటి కాయలు.

"నువ్వేదో ఊహించుకొని ఇక్కడ జేరినట్టున్నావు- పదేళ్ల క్రితం నేను జేరినట్టు. నిజానికిదంత తీసివేయ దగ్గదేమీ కాదు. విశాఖ తర్వాత అంత పేరుంది. నెల నెలా వేలకొద్దీ టన్నుల ఆర్డర్లుండేవి. కార్మికరత్న, యాజమాన్య రత్న వగైరా అవార్డులొచ్చేవి ప్రతియేటా. 88లో ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో మంది మూడో ఉత్తమ కంపెనీగా లెక్కగట్టారు. అయితే ఇప్పుడది గతించిపోయిన స్వర్ణయుగం. రెండేళ్ల నుంచి అంతా తలకిందులయింది. ఇప్పుడు పరిస్థితేంటంటే గత నాలుగు నెల్లుగా నెలజీతాలివ్వటం కూడా కనా కష్టంగా మారింది. బోనస్‌ల మాట దేవుడెరుగు. ఇన్సూరెన్సూ, పి.యఫ్. కట్టటం కూడా మానేశారు. కంపెనీ బస్సులు కూడా రద్దయ్యాయి. ఇప్పుడు రోజూ క్యాంటీన్ నడవటమే గగనం."

"ఎందుకని సార్? ఒక్కసారిగా..."

"ముఖ్యంగా ఆర్డర్లు... ఆర్డర్లు లేవు. ఇప్పుడు నెలకో రెండువేల టన్నుల లోడు తీయటమే గొప్ప. ఇంకా సవాలక్ష కారణాలు. ఇంతకు ముందున్న యం.డి దారుణంగా తినేసిపోయాడు. నువ్వు చూసే ఉంటావు పేపర్లో వచ్చిందే".

అప్పుడు గుర్తొచ్చింది శ్రీహరికి. ఆ యండీ ఒక ఐయ్యేయస్ అధికారి. ఎప్పట్నించో అవినీతి ఆరో పణలు. కొద్దినెల్ల క్రితమే కంపెనీ అంత దివాళా స్థితిలో ఉన్నా రెండు కిలోల ముత్యాలు కొని ఒక మంత్రికి బహుమతిగా ఇచ్చాడనీ, ఆ మంత్రి వాటితో తన తిరుపతి మొక్కు తీర్చుకొన్నాడనీ, దానిపై విచారణకు ఆదేశించామనీ ప్రభుత్వ ప్రకటన.

"అదీ పరిస్థితి. అక్కడున్న కొద్దినెలలూ ఎంత గిల్టీగా గడిపానో చెప్పలేను," అన్నాడు శ్రీహరి.

"ఎందుకూ?" అడిగాడు బోసు.

"చెప్పాను కదూ. అక్కడ క్యాంటీన్ నడవటమే కష్టంగా ఉంది. ఫాక్టరీ మొత్తం ఆ ఒక్క ఫర్నేస్ మీదే నడుస్తోంది. ఆ కార్మికులు చావుకు తెగించి ఆ భగ్గుమనే మంటల్లోంచి తీసిన మెటలూ దానిమీద వచ్చే ఆదాయమూ మా కడుపు నింపాయి. ఆ తిండి తిన్నప్పు డల్లా..."

"అంత ఫీల్ కాకు. నువ్వు మట్టుకు ఏం చేస్తావు?" బోసు శ్రీహరి భుజం తట్టాడు.

"అవును. కానీ... ఎంత మరిచిపోదామన్నా ఆ రోజు ఆ ఫర్నేస్‌నూ... రాజారావునూ.... ఊహించుకోవ టానికే కష్టంగా ఉంది," అన్నాడు శ్రీహరి... ఫర్నేస్ ఎదురుగా పాలిపోయి ఉన్న మొహంతో నిలబడి వున్న రాజారావును చూస్తూ.

"ఊ! కంకాష్ట్ మెషీనే.... ఇంకెంతసేపు చూస్తావు గానీ పని చూడు," అన్నాడు విద్యాసాగర్ శ్రీహరిని.

అతడు విసుగ్గా అవతలికి కదిలాడు ప్రసన్న వైపు.

"మన్ని చూసుకొని ఎస్టిమేషన్ వేసుకొమ్మన్నారు బానే ఉంది. కానీ ఇవరం తవరం లేకుండా ఏదెక్క డుందో తెలీకుండా ఈ అడవిలో ఏం చూస్తాం? ఇంక మనది మనం విప్పి చూసుకోవాలి," అంటున్నాడు రత్న కిషోర్ ప్రసన్నతో.

ప్రసన్న నవ్వి, "నీకంత శ్రమ అక్కర్లేదు. పెద్ద లిస్టు ఇచ్చార్లే ఇక్కడి ఆస్తుల వివరాలు. మీ బాసుడి దగ్గర చూడలా?" అన్నాడు.

అప్పటికే విద్యాసాగర్ ఒక కాపీ రాజారావుకిచ్చి తనొకటి తీసుకొని కదిలాడు. అక్కడ్నించి వాళ్లు సాయంత్రం దాకా ఊపిరి సలపనంత వేగంగా పనులు కానిచ్చారు.

ప్రతి గదికీ ప్రతి మెషీన్ దగ్గరికీ పోవటం, దాని స్పెసిఫికేషన్లు తీసుకోవటం, ఇనుమూ ఉక్కూ అయితే వాటి బరువులు అంచనా కట్టటం, లిస్ట్‌లో ఆ అయిటం ఎదురుగా ఉజ్జాయింపుగా దాని ధర రాయటం.

"అబ్బాయిలూ! స్క్రాపురేటు వేసెయ్యండి అన్నిటికీ," ముందే హెచ్చరించాడు విద్యాసాగర్.

సబ్‌స్టేషన్, పంప్ హవుస్, కూలింగ్ టవర్లూ, ఎక్జాస్టు ఫ్యానులూ, కన్వేయర్లూ, కంప్రెషర్లూ, వేయింగ్ బ్రిడ్జిలూ, వర్క్‌షాపులూ, గ్యాస్ క్లీనింగ్ ప్లాంటూ, స్టోర్ రూం, ఎనిమిది వేల టన్నుల స్టీలు బిల్లెట్లు, రోలింగ్ మిల్లూ... చివరకు కప్పు మీది రేకుల్తో సహా వాళ్లు పరిశీలించారు.

అయితే సివిలు వాళ్లు గొప్ప గందరగోళంలో పడి పోయారు.

డ్రాయింగుల ప్రకారం చూస్తే ఏ ఒక్క బిల్డింగూ ఉన్నచోట లేదు. పైగా కొన్ని మాయమైపోయాయి.

''సార్ పంప్‌హవుసు కనపట్టంలేదు,'' కిచకిచ నవ్వుతూ వచ్చాడు సివిల్ కృష్ణ. చివరికి సత్యన్నా రాయణ మనుషులు కత్తులతో చెట్లూ పుట్టలు ఛేదించుకొని వెళ్తే ప్రహరీగోడ పక్కన రెల్లు దుబ్బుల్లో ప్రత్యక్షమైందది. కొలంబస్ అమెరికాను కనుక్కొన్నంత సంబరపడ్డారు వాళ్లు.

అలా కనుక్కున్న వాటిలో రెస్ట్‌రూం ఒకటి. అది ప్రొడక్షను ఆఫీసుకి వెనగ్గా ఉంది.

శ్రీహరి ఆ గది గుమ్మం దగ్గర నిలబడి లోపలికి చూస్తుండిపోయాడు. కొన్నేళ్ల తర్వాత తలుపులు తెరవటం వల్ల గది మొత్తం ఒక ధూళి మేఘం వ్యాపించి ఉంది. అది మెల్లగా మనిషిగా మారి అతని ఎదురుగా నిలబడింది.

''సనా,'' గొణుక్కున్నాడు.

తను ఇక్కడ రిజైన్ చేసి స్వతంత్ర స్టీల్సులో చేర బోయే చివరిరోజు ఈ గుమ్మంలోనే నిలబడి వీడ్కోలు ఇచ్చాడు సనా. ఈ గదిలోనే తన కళ్లముందు దశాబ్దాల చరిత్ర పరిచాడతడు. నైట్‌షిఫ్టులు ముగిశాక గడిపిన నిద్రలేని తెల్లవారుఝాములు... తల దిమ్ము... కళ్లు మంటలు...

సనాకింకా గుర్తు.

తన చిన్నతనంలో బొగ్గు గనులు తప్ప కొత్త గూడెం ప్రాంతమంతా దట్టమైన అడవులు. అక్కడక్కడా విసిరేసినట్టున్న ఊళ్లూ, లంబాడా గిరిజన తండాలూ. భద్రాచలం మెయిన్ రోడ్డు మీద రోజుకొకటి రెండుసార్లు ఈసురోమని నడిచే ఎర్రబస్సులు. కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో పెనుఘోష పెట్టే ఆవిరితో నడిచే గూడ్సు బళ్లు. వాటి చీదుడు మైళ్లకొద్దీ వినిపించేది.

ఏ పండక్కో పబ్బానికో పెళ్లిళ్లకో తప్ప ఊరు దాటి ఎరుగని జనం. వర్షాధార పంటలు. కోస్తా నుంచి వలస వచ్చిన చిన్నా చితకా రైతులు. ఏడాదికి రెండు మూడు నెలలు మించి దొరకని పనులు. అడవుల్లో కాయా కసరు ఏరుకోవటం.

మెయిన్ రోడ్డుకి దారితీసే మోకాల్లోతు బురదలో మునిగి ఉండే సన్నటి కాలిబాటలు. రోడ్డు మీద నిలబడి వచ్చేపోయే బొగ్గులారీల్నీ, ఎర్రబస్సుల్నీ కళ్లు విప్పార్చి చూసే పిల్లలు. అప్పుడే సనా వాళ్లతో కలిసి డ్రైవరు లేకుండా నడిచే లారీల్నీ, తలకాయలు లేకుండా మోటారు సైకిళ్లు నడిపే వాహనధారుల్నీ చూసింది.

ఏ పుష్కరాలకో దూరప్రాంతాల నుంచి పేంటూ, చొక్కా వేసుకొని వచ్చే బంధువులూ, నాలుగైదేళ్లకోసారి ఓట్ల పండక్కి దిగే తెల్లచొక్కాల బాబులూ, జీపులూ. తండా జనమంతా గుమిగూడి జోరుగా, ఆశ్చర్యంగా వేసే ప్రశ్నలకి వాళ్లు ఓపిగ్గా, చిరాకుగా సమాధానాలిచ్చే వాళ్లు.

''మనదేశము భారతదేశము. మన ప్రధాని ఇందిరాగాంధీ. మన ఎన్నికల గుర్తు ఆవూదూడా.''

అప్పటి ముఖ్యమంత్రి కేంద్రస్థాయిలో మంత నాలు జరిపి తన స్వంత జిల్లాలో కనీసం కొన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమలైనా ఉండాలనీ, బొగ్గుగనుల్ని ఉపయో గించుకోవాలనీ పట్టుపట్టటం వల్ల మూడు నాలుగు భారీ పరిశ్రమలు వెలిశాయి 1970 ప్రాంతంలో. అత్తా రింటికి పోయొచ్చినంత తరచుగా రష్యా వెళ్లొచ్చే ఒక బెజవాడ ప్రముఖుడు- వెనుకబడిన ప్రాంతపు సబ్సిడీ లన్నీ తనకు వర్తించేట్టు ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసు కోవటంవల్ల ఒక ప్రైవేటు పరిశ్రమ కూడా ప్రారంభ మైంది.

అలా సరిగ్గా మైలు దూరంలో ప్రభుత్వ రంగంలో ఆంధ్రా స్టీల్సు, ప్రైవేటు రంగంలో స్వతంత్ర స్టీల్సు స్థాపించబడ్డాయి- సరిగ్గా అంతకు ఇరవయ్యేళ్ల ముందు పండిత నెహ్రూ కన్న కలలా. ఆయన ప్రతిపాదించిన నమూనాలా (అయితే మరి ఇరవయ్యేళ్లకల్లా మొద టిది దివాళా తీసింది. రెండవది ఐదు లక్షల పెట్టుబడి నుంచీ ఐదొందల కోట్లకు విస్తరించి మొదటిదాన్ని కొనేందుకు ముందుకొచ్చింది).

''అబ్బో అదంతా ఎప్పటి మాట,'' అన్నాడు సనా- టీ కుర్రాడు అప్పుడే అందించిన చాయ్ చప్పరిస్తూ. ఫ్యాక్టరీ అంతా నియాన్ లైట్ల వెలుతురులో మునిగి ఉంది. మునగదీసుకున్నట్టున్న యంత్రాలూ, రెస్ట్ రూంలో కునికిపాట్లు పడుతున్న కార్మికులూ.

''అదంతా యాదికొస్తే దిమాక్ ఖరాబయిపోద్ది,'' మళ్లీ అన్నాడు తనే.

''చెప్పు చెప్పు,'' అనేవాడు శ్రీహరి. కాదనకుండా అతను గతంలోకి జారేవాడు.

రెండు మూడేళ్లలో పునాదుల నుంచి పెద్దపెద్ద కట్టడాలు లేచాయి. దేశ విదేశాల నుంచి (ఎక్కువగా రష్యా నుంచి) ఇంజనీర్లు రావటం మొదలయింది. తెల తెలవారుతుండగా ఓ ఉదయాన 'బొయ్యి'మని సైరన్లు కూశాయి. తండాలన్నీ ఉలిక్కిపడి నిద్ర లేచాయి.

అది మొదలు.

ఓ తుఫాను కేంద్రం ప్రచండమైన వేగంతో సరివి తోటల మీదుగా ప్రయాణించినట్టు ఊళ్లకు ఊళ్లన్నీ ఆ

సుడిగాలిలో కొట్టుమిట్టాడాయి. దశాబ్దాలుగా అక్కడ గడ్డ కట్టుకొని ఉన్న నిశ్శబ్దం మంచు పలక పగిలినట్టు పగిలింది. నిశ్చల జనజీవనం ఒక్కసారిగా పోటెత్తే ప్రవాహంగా మారిపోయింది.

కాలిబాటలు కంకర్రోడ్లయ్యాయి. నాలుగైదు టెంటు థియేటర్లు వెలిశాయి (దేవదాసు సినిమాలో చచ్చిపోయిన నాగేశ్వర్రావు దసరాబుల్లోడులో గంతులు వేస్తుండడాన్ని సహించలేని జనం తిరగబడ్డారు. ఒక టెంట్ థియేటర్ నేలమట్టమైంది.)

వైనుషాపులూ, బార్లూ, చికెన్‌సెంటర్లూ, కిరాణా దుకాణాలూ, డాబా ఇళ్లూ, కరెంటు స్తంభాలూ, బల్బులూ, చిట్టీ పాటలూ, తాకట్టు దుకాణాలూ, మార్వాడీలూ, అప్పులూ, ఫర్నిచర్ షాపులూ, టేకు మంచాలూ, పాన్‌షాపులూ వచ్చేశాయి. మరి పదేళ్ల కల్లా చిట్‌ఫండ్ కంపెనీలూ, లాడ్జింగులూ, త్రీస్టార్ హోటళ్లూ, ఇన్‌స్టాల్‌మెంట్ల మీద వాహనాల అమ్మకాలూ, సూపర్ మార్కెట్లూ, సినిమాహాళ్లూ, చికెన్ కబాబు సెంటర్లూ, రోజ్‌వుడ్ తలుపులూ, వాటి మీద పూలపూల డిజైన్లూ, ఆయుర్వేదం స్థానే అల్లోపతీ, ఆరెంపీల స్థానే యంబీబీ యస్సులూ, అయిదు రూపాయల దవాఖాన్ల పక్కన ఐదు నక్షత్రాల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులూ ప్రత్యక్ష మయ్యాయి. వాటిల్లో జేరటానికి తగినన్ని రోగాలు రావటం కూడా మొదలయ్యింది.

''ఇంకో ముచ్చట జెప్పాలె సారూ! ఈని తండల ఈడే మిలియనీరన్నట్టు,'' అప్పుడే క్రేను దిగి వచ్చిన జలీల్ సనాని బనాయించాడు.

అందులో కొంత నిజం లేకపోలేదు.

ఆ తండాలో మొదటిసారిగా సైకిలు కొన్నవాడు సనా. తెలతెలవారుతుండగా తండా నిద్రలేచే సమయానికి నైటుషిఫ్టు నుంచి తిరిగొచ్చి నిద్రలోకి జారుకొనేవాడు. నాలుగైదు ఏళ్లు గడిచాక ఇల్లెందు నుంచీ గూన పెంకులు తెచ్చి సిమెంటు గోడల ఇల్లు లేపాడు. మొదటిసారిగా లైసెన్సు తీసుకొని రేడియో కొన్నవాడూ అతనే. ఆ చుట్టుపక్కల ఊళ్లల్లో మొదటిసారిగా కరెంటు బల్బు వెలిగిందీ అతని ఇంటిలోనే. (అతని గురించీ రెండు మూడు తరాల వరకూ తల్లులు తమ పిల్లలకు కథలు కథలుగా చెప్పారనీ, అతనింట్లో అతిథులకి దొరికే టీ గురించీ అనేకమంది అతన్ని చూడవచ్చే వాళ్లనీ జలీల్ అనేవాడు).

''ఏమి మిలియనీరో సారు. కొడుకు కాలేజీ చదువుకీ, బిడ్డ పెండ్లికీ, బారియ రోగాలకీ పాతికవేలు అప్పుపడిన. ఎంత చెట్టుకి అంత గాలన్నట్టు. మా తండల జనం నాలా ఈ ఉజ్జోగాల బారినపడి అప్పులు పాలవకుండా బతుకు నెట్టుకొచ్చిన్రు. నేను మాత్రం అయినకాడికి ఆ ఇల్లు కుదవబెట్టి మన కాలనీలో తేలిన. తండల ఉన్నప్పుడు గంజో గటకో తాగి బతక బడితిమి. ఇక్కడ కంపెనీ లెవెలు మెయింటెయిను జేయను ఫ్యాన్లు, టీవీలూ, గ్యాసు పొయ్యిలు, కాన్వెంటు చదువులు, కట్నాలు, మోపెడ్లు, అప్పులు,'' సనా ఇంకా ఆ గుమ్మంలో నిలబడి విస్మయం నిండిన గొంతుతో మాట్లాడుతూనే ఉన్నాడు.

సివిలువాళ్లు టేపులు తీసి కొలతలు మొదలు పెట్టారు. శ్రీహరి వెనుక రాజారావు, జలీలు లోపలికి అడుగుపెట్టారు.

రెస్టరూం మధ్యలో పొడవునా జాజిచెక్క బల్లా, చుట్టు ఏడెనిమిది కుర్చీలూ, అవతలగా సగం తలుపులు తెరిచి ఉన్న అలమరా... అన్నీ బూజులో, దుమ్ములో కప్పడిపోయి ఉన్నాయి. మనుషుల అలికిడికి అందాకా బల్లకింద పడుకొని ఉన్న కొండచిలువ ఒకటి కదిలి కిటికీలోంచి భారంగా బయటకు జారనారంభించింది. అందరూ గుసగుసలాడుతూ ఊపిరి బిగబట్టి దాన్నే చూస్తున్నారు విగ్రహాల్లా నిల్చుండిపోయి.

అదికాదు రాజారావు చూస్తున్నది. ఆ బల్లచుట్టూ కుర్చీలు... అవి అడ్డదిడ్డంగా తలా ఒక దిక్కుకి తిరిగి ఉన్నాయి. పాంపే నగరం మీద లావా విరుచుకు పడినప్పుడు ఎక్కడివక్కడ వదిలేసి పోయినట్టు... సరిగ్గా నాలుగేళ్ల క్రితం వాటిల్లో కూచొని ఉన్న మనుషులు హడావిడిగా ఇప్పుడే లేచిపోయినట్టు...

ఆ కుర్చీల్లో కూచున్నవాళ్లు ఎక్కడివక్కడ వదిలేసి పోయిన ఆరోజు రాజారావుకి బాగా గుర్తు.

ఫాక్టరీ గేటు దగ్గర గలాటా మొదలయ్యింది. సెకండు షిఫ్టుకి రావలసిన ఉద్యోగులూ, కార్మికులూ బయట నుంచి అరుస్తున్నారు. జనరల్ షిఫ్టులో ఉన్న వాళ్లను వాళ్ల వాళ్ల వస్తువులు తీసుకొని బయటకు పొమ్మని హెచ్చరిస్తున్నారు సెక్యూరిటీ వాళ్లు. రెండు పాలపిట్ట రంగు వాన్ల నిండా చిప్పటోపీల, బారు తుపాకుల పోలీసు ఫోర్సు దిగింది.

రెస్టరూంలో ఉన్న సనా మరికొందరూ ఒక్క ఉదుటున బయటకు పరిగెత్తారు. గేటు దగ్గర యండీ కారును చుట్టుముట్టి నిలేసిన ఉద్రిక్తత నిండిన మొహాలు. ఏది ఏమైనా కంపెనీని తామే నడుపుతామంటున్నారు ఉద్యోగులూ, కార్మికులూ.

ఫ్యాక్టరీలో నిరవధికంగా లాకవుట్ ప్రకటించ బడింది. వాగ్యుద్ధం... తోపులాట... టియర్ గ్యాస్... తుపాకీ మందు వాసన.

కాల్పుల్లో ఏడుగురు ప్రాణాలు వదిలారు. సనా, నాగభూషణం కూడా వాళ్లల్లో ఉన్నారని మరుసటి రోజు పేపర్లో వచ్చింది.

అంతకుముందు రోజు వచ్చిన దినపత్రిక ఒకటి అదే జాజిచెక్క బల్లమీద గత నాలుగేళ్లుగా ఇంకా భద్రం గా అలాగే ఉంది. రాజారావు ఆ బల్ల దగ్గరికి నడిచి దాని మీది దుమ్ము దులిపి, గోధుమ రంగు చారికలతో అతుక్కుపోయిన పేజీలని జాగ్రత్తగా తెరిచి చూస్తు న్నాడు. మొదటి పేజీలో హెడ్‌లైన్‌గా ఉంది ఆ వార్త.

‘‘అబ్బాయిలూ! ఇక లైసెన్సురాజ్ శకం ముగి సింది. సరళీకరణ ఉద్యమం మొదలైంది. మన ప్రజలు మరో పదేళ్లలో స్వర్ణయుగాన్ని అనుభవించబోతు న్నారు,’’ అని ఎర్రకోట మీంచి అప్పటి ప్రధాని ప్రకటన అది.

ఇంతలో బయటినుంచి లంచ్‌కి కబురొచ్చింది.

తనకాకలి లేదని రాజారావూ, పాలొంచ పోయి స్తానని శ్రీహరీ చెప్పటంతో మిగిలిన వాళ్లతో కార్లూ, జీపులూ కదిలాయి. షెడ్డులో ఇద్దరే మిగిలారు.

‘‘ఏంటి సార్ ఇలా జరిగింది. ఇదంతా ఇలా చూడటమే కష్టంగా ఉంది,’’ అన్నాడు శ్రీహరి.

రాజారావు దీర్ఘంగా ఊపిరి విడిచి గాంట్రీబే పక్కన అప్పట్లో వర్కర్లు ఉపయోగించిన చెక్కపెట్టెల మీద కూర్చున్నాడు. అవి కిరకిరలాడాయి.

‘‘జాగ్రత్త సార్! అసలే చెదలు పట్టి ఉన్నాయి,’’ అన్నాడు శ్రీహరి తనూ పక్కనే కూచొంటూ. రాజారావు బూట్లు ఊడదీసి దులుపుతున్నాడు.

‘‘శ్రీహరీ! అప్పుడు మనం ఇక్కడే కూచొని మాట్లాడుకున్నాం. గుర్తుందా?’’

‘‘ఉంది సార్.’’

‘‘అంతకుముందు రోజే బుచ్చిరెడ్డి నిన్ను...’’

‘‘అవును. ఆరోజు వర్కర్లూ ఆయనా పోట్లాడు కున్నారు.’’

‘‘ఎందుకనుకున్నావ్?’’

‘‘నేను అప్పుడే అడుగుదామనుకున్నా సార్. ఎందుకూ?’’

‘‘ఆరోజు చెప్పాను కదూ అంతకు రెండేళ్ల ముందునించి సడన్‌గా లాసు రావటం మొదలైంది. ప్రభుత్వం నుంచి మనకొచ్చే ఆర్డర్లు హఠాత్తుగా స్వతం త్రాకి మళ్లాయి. అదేమని అడిగితే వాళ్లు తక్కువకి కోట్ చేశారనీ, మనం టైమ్లీ డెలివరీ చెయ్యలేమనీ, క్వాలిటీ సమస్యలనీ అన్నారు. ఇంక మనం తేరుకోలేమనీ, మళ్లీ వెనుకటి ప్రొడక్షను అందుకోలేమనీ భరోసా వచ్చాక స్వతంత్రవాళ్లు మనకంటే ఎక్కువ కోట్ చెయ్యటం మొదలెట్టారు. అయినా ఆ ఆర్డర్లని మాత్రం వెనక్కి తెచ్చుకోలేకపోయాం. దీనిక్కారణం అప్పటి ప్రభుత్వ పాలసీ ఒక్కటే కాదు. హైదరాబాదులో ముఖ్యమైన వాళ్లని స్వతంత్రవాళ్లు బాగా సంతృప్తిపరచారనీ, మంత్రులస్థాయిలో ఇన్‌ఫ్లూయెన్సు చేశారనీ అంటారు. అప్పుడే మనకి రా మెటీరియల్ అమ్మే ప్రైవేటు కంపెనీలూ ధరలు రెట్టింపు చేశాయి. అలా ఎక్కువకి కొని తక్కువకి అమ్మి సరిగ్గా మన పని ఐస్‌బర్గుల మధ్య ఇరుక్కున్న గుడ్డి తిమింగలంలా అయింది. ఈలోగా మనవాళ్లు పైన సీనియర్ మేనేజర్ల నుంచీ కింద ఆఫీసు ప్యూను దాకా స్వతంత్రతో లాలూచీ పడిపొయ్యారు. ఇక్కడ మనం ఏంచేసినా తెల్లారేసరికి స్వతంత్ర యండీకి తెలిసిపోయేది,’’ అన్నాడు రాజారావు.

నిజానికి శ్రీహరికి ఆంధ్రా స్టీల్సులో చేరిన కొత్త లోనే అర్థమయింది.

‘‘రన్నింగ్ కండిషన్‌లో ఉన్న మెషీన్లని స్క్రాపు కింద అమ్మకు నూకారు.’’

‘‘రా మెటీరియల్ సప్లై చేసే వాడు ఫలానా మంత్రికి మేనల్లుడు. వాడు మార్కెట్ రేటుకు రెట్టింపు కోట్ చేసి అంటగడతాండు.’’

‘‘గూడ్సు బళ్లయితే లేటవుద్దని వంక చెప్పి ప్రైవేటు ట్రాన్స్‌పోర్టుకి లీజుకిచ్చారు. పదిహేను లక్షల లాసు.’’

‘‘అవుట్ గోయింగ్ మెటలు బరువు తప్పుల తడక. వేయింగు బ్రిడ్జి ఇన్చార్జ్ ఏడాదిలో బంగ్లా కట్టిండు.’’

‘‘రోలింగు మిల్లు ప్రపోజలు పెట్టి రెండు కోట్లు ముంచేసినారు. అదసలు మనకు పనికేరాదు. దానికి తాళం వేసి మూలబెట్నారు.’’

‘‘యూనియన్ లీడర్ పాపారావు ఏ.సీ కారు కొన్నాడు. వాడూ యండీ కలిసి తిరుగుతాండ్రు.’’

ఇంకెన్నో.

ఏడాది చివర్లో జీతాలివ్వటం ఆపేశారు. శ్రీహరికి ఇంటి దగ్గర్నించి యం.వో వస్తుండేది.

‘‘అప్పుడే బుచ్చిరెడ్డికి అంటగట్టారు ప్రొడక్షను డిపార్టుమెంటు. ఆయన పని పులుసులో పడినట్ట

యింది. సరిగ్గా నువ్వప్పుడు జాయినయ్యావు," అన్నాడు రాజారావు.

అవును. ఇటు వర్కర్లు పని చెయ్యమని మొండి కెత్తి కూచున్నారు. అటు పై నుంచి షంటింగ్. మధ్యలో పిచ్చిచూపులు చూస్తూ, బీపీ పెరిగిపోతూ బుచ్చిరెడ్డి.

"నేనిక్కడున్న ఏడాదిలో చూశాను సార్. ఒక్కడూ సరిగ్గా పని చెయ్యలేదు. ఓరోజు మెటలు లాడిల్సులో పట్టాక క్రేన్ ఆపరేటరు టీ టైం అయ్యిందని ఆపన్నే పొయ్యి అరగంట కొచ్చాడు. అది గడ్డకట్టి, దాన్ని మళ్లీ బద్దలు కొట్టించి... లక్షకు పైగా లాసు. ఘోరం కాదా సార్," అన్నాడు శ్రీహరి.

"అవును పనిదొంగలున్నారు... అన్ని చోట్లా, అన్ని కాలాల్లో. ఇప్పుడు మన స్వతంత్రాలో లేరా? ప్రైవేటుదే అయినా పని తప్పించుకొనే సెక్షను ఒకటి పై నుంచి కిందకు ఉంటూనే ఉంటుంది. అయితే ఆ లోడు వేరే వాళ్లు మోయాల్సి వచ్చేది. ఇక్కడ అప్పట్లో సనా, నాగ భూషణం... వీళ్లలాంటి వాళ్లనుకొన్నావు. స్నానం పానం లేకుండా ఏకబిగిని ఐదారు షిఫ్టులు చేసేవాళ్లు- ఆర్డర్లు మీటవ్వటానికి. అయితే చివరకు నెలజీతాలు రాకపోవ టంతో వాళ్లూ మొండికెత్తారు. ఆఖరికి నా మాట వినటం కూడా మానేశారు," అన్నాడు రాజారావు.

అవును. చివర్లో అంతా ఒక అసంబద్ధ చిత్రంలా ఉండేది. కరెంటు బిల్లు కట్టకపోవటంతో బోర్డువాళ్లు కనెక్షన్లు పీకేశారు. జనరేటరుకి ఆయిలు కొంటం కూడా కష్టమయ్యింది. చీకటిగదుల్లో రోజల్లా ఉలుకూపలుకూ లేకుండా కూచొని, తమ షిఫ్టులు ముగించుకొని, నిశ్శ బ్దంగా పోతుండేవాళ్లు. క్యాంటీన్‌లో ఏం దొరుకుతుందా అని రోజంతా ఎడతెగని ఆలోచనలు. పంప్ హవుస్ ఆగిపోవటంతో మంచినీళ్లకి కూడా కటకట. ఫలానా వాడి పెళ్లాం ఫలానావాడితో... ఫలానా వాడింత కూడ బెట్టాడు... గుసగుసలూ... కీచులాటలూ... కుక్క జట్టీలు.

కంపెనీ బీ.ఐ.ఎఫ్.ఆర్ ముందుకి పొయ్యాక... దీన్నెంత త్వరగా మూసేస్తే అంత మంచిదని అది ప్రకటించాక... ఇక ఉద్యోగులు కంపెనీకి రానవసరం లేదనీ జీతాలు (?) ఇళ్లకు పంపుతామనీ నోటీసు బోర్డులో పెట్టారు. కంపెనీని కొంటానికి ఎవరైనా ముందుకొస్తే దాంతో బకాయిలు తీర్చి, జీతాలు చెల్లిస్తా మని కొనేవాళ్ల నుంచి బిడ్లు ఆహ్వానిస్తూ మరొక పత్రికా ప్రకటన. కంపెనీకున్న రెండొందలెకరాల భూమిలో సగం అమ్మి దాన్ని పెట్టుబడిగా పెట్టి కంపెనీని మళ్లీ లాభాల బాటలో నడపొచ్చని ఉద్యోగ, కార్మిక సంఘాల ఎదురు ప్రకటన. లోకల్ ఎమ్మెల్యేలూ, మంత్రులూ, స్వతంత్ర స్టీల్సు గెస్ట్‌హవుసులో దిగి పరిస్థితిని జాగ్రత్తగా గమనించసాగారు. ఏసీ కార్లు కార్మిక నాయకుల ఇళ్ల చుట్టూ, యండీ బంగ్లా చుట్టూ తిరగనారంభించాయి. అప్పటికే ఆంధ్రా స్టీల్సుకి చెందిన ఉత్పత్తుల డిజైన్లూ, డ్రాయింగులూ, ప్రాజెక్టుల వివరాలూ స్వతంత్ర స్టీల్సుకి చేరిపొయ్యాయి. వాటిని కొంచెం అటిటు మార్చి మార్కెట్లోకి వదిలారు. అదీ చివరి చావుదెబ్బ.

నడి సముద్రంలో టైటానిక్ మునగటం ప్రారం భించింది. చావు బతుకుల యుద్ధం మొదలైంది.

ఉద్యోగులూ, ఇంజనీర్లూ కొత్త కంపెనీల్ని వెతకటం మొదలుపెట్టారు. కొద్దిమంది ఎలాగో గట్టెక్క గలగారు (రాజారావుని స్వతంత్ర ఎండి స్వయంగా ఆహ్వానించి ఉద్యోగం ఆఫర్ చేశాడు). వర్కర్లు అనేక ఏళ్లు ఆంధ్రా స్టీల్సు కాలనీలోనే ఆశలు చావక ఎదురు చూశారు. కాలనీకి కరెంటు, నీళ్ల కనెక్షన్లు పీకేశారు. కొంతమంది పాలొంచలో రిక్షాలు తొక్కటం, హమాలీ లుగా జేరటం, చెప్పులు కుట్టటం. కొద్దిమంది పేట రౌడీలుగా ఎదిగారు.

పదిహేడుకి పైగా ఆకలిచావులు. కాదని ప్రభుత్వ ప్రకటన. ఆ అనుమానానికి కూడా ఆస్కారం లేకుండా ఎనిమిదిమంది ఉరి పెట్టుకున్నారు. ఇళ్లల్లో గలా టాలూ, భార్యా పిల్లల్ని రాళ్లతో మోదటాలూ. కొద్దిమంది బొంబాయి రెడ్‌లైట్ ఏరియాలో తేలారు. కొంతమంది 'ఇప్పుడే వస్తా'మని చెప్పి భార్యాపిల్లల్ని వదిలి దేశాలు పట్టిపోయారు. మణుగూరు అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్‌లో చెదిరిన లుంగీలతో, ఛాతీమీద తుపాకీ గుండు రంధ్రాలతో వచ్చిన ఫొటోల్లో ముగ్గురు ఆంధ్రా స్టీల్సు కార్మికులున్నారు. ఇద్దరు తప్పించుకుపోయారు.

"సరే. ఇంతకూ ఆ రోజు ఏం జరిగింది?" అడిగాడు బోసు.

"జరగాల్సిందే జరిగింది," నిట్టూర్చాడు శ్రీహరి.

సాయంత్రానికల్లా జీపులూ, కార్లూ తిరుగుమార్గం పట్టాయి. సెక్యూరిటీ వాళ్లు టార్చ్‌లైట్లు వెలిగించి ప్లాంటు మొత్తం ఒకసారి తనిఖీచేసి మళ్లీ తాళాలు బిగిం చారు. ఆంధ్రా స్టీల్సు మళ్లీ చీకటిలో మునిగిపోయింది.

అక్కడ స్వతంత్రాలో తెల్లవార్లూ లైట్లు వెలుగు తూనే ఉన్నాయి. కాలిక్యులేటర్లూ, డ్రాయింగులూ దగ్గర పెట్టుకొని టీ, సిగరెట్టు పొగల మధ్య తెల్లవారు ఝాముకి రిపోర్టు తయారుచేశారు. శ్రీహరీ, రాజారావూ,

విద్యాసాగర్ ఇంకా అనేకమందికి కళ్లు చింతనిప్పుల్లా తయారయ్యాయి (ముందు జాగ్రత్తగా ఒక టైపిస్టుని దగ్గరే ఉంచుకున్నారు).

"మరి మేం పొద్దున ఏడింటికి ఇళ్లకిపోయి ఒక కునుకు తీసి లంచ్‌టైంకి తిరిగొచ్చేసరికి రాజారావుకి ఒక కవరు ఇచ్చారు. అందులో ఇంక మీ సేవలు మా కవసరంలేదనీ, మరో వారంలో డ్యూటీ నుంచి రిలీవ్ కావొచ్చనీ ఆర్డరు కాగితం ఉంది."

"అదేమి? రాజారావు ఎఫీషియంటనే కదా మీ వాళ్లు పిలిచి మరీ ఉద్యోగమిచ్చింది?" బోసు నివ్వెర పోయి అడిగాడు.

శ్రీహరి చిత్రంగా నవ్వాడు.

"ఊ! సమర్థత అంటే నాకు చచ్చే నవ్వొస్తుంది. అసలు సమర్థతంతా మా యండీది. ఎప్పటికైనా ఆంధ్రా స్టీల్సుని కొనేసి నడుపుదామనే మా అందర్నీ పిలిచి మరీ తీసుకొంది. కానీ ఆరోజు ఉదయానికల్లా ఆయన ఆలోచన మారిపోయింది."

"ఏమీ కొననే లేదా?"

"ఊహూ! కొన్నారు."

"మరి?"

"కొని మూసేశారు."

"అదేంది గురూ లాసు కాదూ?"

"కాదు ముప్పయ్‌కోట్ల లాభం. ఆరోజు మేం తయారుచేసిన రిపోర్టులో ఆంధ్రా స్టీల్సు మెషినరీ అంతా స్క్రాపు రేటుకే కోట్ చేశాం."

"ఆ మాత్రానికే?"

"ఊహూ! అసలు మతలబు కంపెనీ భూముల విషయంలో జరిగింది. రెండొందల ఎకరాల భూమి 1970 నాటి రేటుకే పళ్లెంలో పెట్టి మరీ... తాంబూలా లతో సహా... అందించింది ప్రభుత్వం."

"అదేంటి గురూ! ఇంత ఘాతుకమా? పత్రికలూ, ప్రతిపక్షాలూ ఊరుకుంటాయా?"

"ఏం చేస్తారని నీ ఊహ? సనత్‌నగర్ నడిబొడ్డున చదరపు గజం ఐదువేలు చేసే ఆల్విన్ ఆస్తుల్ని వంద రూపాయల చొప్పున అమ్ముకోలేదూ?"

"మై గుడ్‌నెస్."

"ఊ! ఇంక మన స్టాఫ్‌వేర్ భాష మాట్లాడకు. హబ్సిగూడ వచ్చేశాం," అన్నాడు శ్రీహరి. ఆటో ఎన్జీఆర్ై మొదటిగేటు దగ్గర మలుపు తిరిగి పది నిముషాలు ప్రయాణించి ఆ కాంపౌండ్‌లోకి ప్రవేశించింది.

"ఆ పైనుండేదే," శ్రీహరి దిగి ఆటో అతనికి డబ్బులిస్తున్నాడు. బోసు తలెత్తి పై పోర్షన్‌ని చూశాడు.

"ఇక్కడుంటున్నాడని ఎవరు చెప్పారు గురూ?"

"సత్తెన్నారాయణ. మొన్న జూబ్లీహిల్సులో గృహ ప్రవేశానికి పిలిచాడు."

ఇద్దరూ నిశ్శబ్దంగా మెట్లెక్కుతుండగా కింద నించి కూరలమ్మి కేక.

బోసు గుసగుసగా అన్నాడు. "ఏంది గురూ! గచ్చంతా మొత్తం దుమ్ము కొట్టుకొనుంది. ముగ్గుపెట్టి కొన్ని నెలలయినట్టుంది?"

"నీకింకా చెప్పలేదు కదూ! ఆయన భార్య పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్లి రెండేళ్లు దాటింది. ఈ మధ్యనే మ్యూచువల్ కన్సెంటు మీద విడాకులకి అప్లయి చేశారు."

"ఎందుగ్గురూ?"

"ఎందుకంటే ఏమని చెప్తాం? ఈ మనిషికి పని తప్ప మరొకటి తెలీదు. పదిహేనేళ్ల కాలాన్ని ఆంధ్రా స్టీల్సుకీ, స్వతంత్రాకీ ధారబోశాడు."

కొంచెం ఆగి తలుపుకొడుతూ మళ్లీ అన్నాడు. "చివరకు తన యవ్వనాన్ని కూడా."

కాసేపటికి తెరుకున్న బోసు మామూలుగా అవ్వటానికి ప్రయత్నిస్తూ ఒక అసంబద్ధమైన నవ్వు నవ్వి అనుమానంగా అడిగాడు.

"లోపల ఉన్నాడంటావా?"

"చూద్దాం."

*

మెల్లగా అతను కదిలే ప్రయత్నం చేశాడు. తలుపు మీద ఆగకుండా చప్పుడు.

ప్రయత్నం మీద లేచి నుంచోవటంతో కళ్లు చీకట్లు కమ్మాయి. సోఫాని ఆసరాగా చేసుకొని నిలబడ్డాక ప్యాంటు జారిపోయింది.

వణుకుతున్న చేతులతో బెల్టు వెతికి పట్టుకొని... బిగించి కట్టబోయి విఫలమై... తలుపు మోత ఎక్కువ వటంతో... అలాగే అడ్డదిడ్డంగా నడిచి వెళ్లి గడీ తీశాడు. ఒక్కసారిగా పడిన వెలుతురును భరించలేనట్టు చేతు లతో మొహం కప్పేసుకున్నాడు.

కాసేపటికి కళ్లు తెరిచాక... వేళ్ల సందుల్లోంచి... ఎదురుగా చేష్టలు దక్కి తననే చూస్తున్న శ్రీహరి.

జారిపోయి ఉన్న ప్యాంటునూ, మోకాళ్ల దాకా వేలాడే షర్టునూ కాదు శ్రీహరి చూస్తున్నది. రాజారావు

కాళ్లు... పుల్లల్లా అయిపోయాయి. మెడ మీద బొమికలు వెళ్లుకొచ్చాయి. పొడుచుకొచ్చిన కళ్ల కింద నల్లటి ముడతలు.

''ఇదేంటి సార్?'' శ్రీహరి గజగజ వణికిపోతూ రాజారావును కావలించుకోబోయాడు.

అతను తొట్రుబాటుతో శ్రీహరి చేతుల్ని విడిపించుకొని వెనక్కి వెళ్లి సోఫాలో కూలబడ్డాడు. గదంతా ముక్కవాసన. నిశ్శబ్దం. చీకటి.

బోసు ఆ చీకటిని భరించలేనట్టు గోడ దగ్గరకు నడిచి చేతికందిన మీటలు నొక్కాడు. ట్యూబులైటు వెలిగి ఫ్యాను గిర్రున తిరగటం మొదలుపెట్టింది. టీవీ ఆన్ అయింది.

శ్రీహరి గొంతు పెగుల్చుకొని, ''ఇప్పుడేమయిందని సార్. ఎవరి పరిస్థితి బాగుందని? స్వతంత్రాన్ని వదిలేశాక నాకు మాదాపూర్‌లో జాబొచ్చింది. అంతా మా సమర్థత అనీ అందుకే ఐదంకెల్లో జీతాలొస్తున్నాయనీ పత్రికలు ఊదరగొట్టేశాయి. రెండేళ్లు బానే గడిచాక ఇవాళ పొద్దున్న మా కంపెనీ బోర్డు మారిపోయింది. రాత్రే శామ్స్ ఇంక్ వాళ్లు మా సాఫ్ట్‌వేర్ కంపెనీని టేకోవర్ చేశారు. ఇక్కడికంటే చైనాలో బెటరని హైదరాబాద్ కంపెనీని ఇవాళ మూసేశారు. గేటు దగ్గరే మా వస్తువులు కలెక్టు చేసుకొని తిన్నగా ఆటోలో ఇటొచ్చాం,'' అన్నాడు.

టీవీ తెరమీద ప్రత్యక్షమైన న్యూస్‌రీడర్ రాత్రి ఏడుగంటల వార్తలను హడావిడిగా చదవటం మొదలుపెట్టింది.

''ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను ప్రైవేటుపరం చేస్తూ... ఆర్థికమంత్రి... లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల్ని కూడా... జాతికి హామీ ఇచ్చారు... ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ బీ.యస్.ఈ ఇండెక్స్ రికార్డు స్థాయిలో నూట ఇరవై పాయింట్లు... అయితే మాజీ ప్రధాని దీన్ని ఖండిస్తూ ఈదేశ ప్రజల కష్టార్జితమైన ప్రభుత్వరంగ సంస్థల్ని అమ్ముకొనే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని... తన సంస్కరణల్ని దారి మళ్లించారనీ...''

బోసు హఠాత్తుగా రాజారావు వైపు తిరిగి అన్నాడు.

''సార్! ఇప్పుడు మనమంతా ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం.''

అదేమీ పట్టని రాజారావు ఎటో చూస్తున్నాడు.

ఎదురుగా చీకటి. తాటిచెట్టంత ద్వారం. పావురాల టపటప. వేలాడే కన్వేయర్. మాగువాసన. పాడుబడిన రెస్టారూం. ధూళి మేఘం. చెల్లాచెదురైన కుర్చీలు. జాజి చెక్కబల్ల. కింద కొండచిలువ. పైన గోధుమరంగు దినపత్రిక. మూలగా ఆ ప్రకటన. ఆ గదిలోనే కూచొని రోజులు, నెలలు, ఏళ్ల తరబడి తన ప్రాంతం గురించీ, తన జాతి గురించీ విస్మయమైన గొంతుతో అవిరామంగా మాట్లాడుతున్న సనా.

*తానా 'తెలుగు వెలుగు' సావనీర్, 2001*
*విపుల మాసపత్రిక, ఆగస్ట్ 2001*